క్లుప్తంగా

వంగర ఎంపీడీఓగా రాజారావు



ఎంపీడీఓ రాజారావుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు

వంగర: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా(ఎంపీడీఓ) టి.రాజారావు బుధవారం బాధ్యతలు స్వీకరించా రు. ఇది వరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఎస్.రఘునాథాచారి జిల్లా పరిషత్ కార్యాలయానికి సెక్షన్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు. నందిగాం మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న రాజారావు పదోన్నతిపై ఇక్కడికి ఎంపీడీఓగా వచ్చారు. ఎంపీడీఓ రాజారావుకు కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

వంగర: నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పిన్నింటి రామారావు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో మడ్డువలస ప్రాజెక్టుకు వరద తాకిడి అధికమైందన్నారు. కొప్పర, గీతనాపల్లి, కొండ చాకరాపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చామని చెప్పారు. వరద సమస్య ఉంటే కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు.

అభివృద్ధికి చుక్కాని చదువే



విద్యార్థినులకు పుస్తకాలు అందజేస్తున్న జె.సి.రాజు, తదితరులు

బొబ్బిలి: అక్షరాస్యత మానవ హక్కు అని, అభివృద్ధికి దిక్సూచి, మార్గదర్శి చదువేనని రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జె.సి.రాజు అన్నారు. రోటరీ క్లబ్ నిర్వహిస్తున్న బేసిక్ ఎడ్యుకేషన్,అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక శ్రీ సాయి డిగ్రీ కాలేజ్‌లో విద్య, అక్షరాస్యత అవసరం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్య ప్రాముఖ్యతపై విద్యార్థినులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. రోటరీ క్లబ్ కార్యదర్శి కె.వి.శివకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ చుక్క రమణ అధ్యక్షత వహించారు. డాక్టర్ సజ్జ అప్పలరాజు, కళాశాల సిబ్బంది, పాల్గొన్నారు.

కుదమకు గురజాడ సత్కారం



తిరుమలరావును సత్కరిస్తున్న విశ్వసాహితీ కళావేదిక సభ్యులు

రాజాం: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రాజాం రచయిత వేదిక సభ్యులు కుదుమ తిరుమలరావును శ్రీకాకుళంలో విశ్వ సాహితీ కళావేదిక ఘనంగా సత్కరించింది. గురజాడ జయంతి సందర్భంగా శ్రీకాకుళం గురజాడ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఈ సన్మానం తనకు లభించిందని తిరుమలరావు బుధవారం రాజాంలో విలేకరులకు తెలిపారు. తిరుమల రావుకు విశ్వసాహితీ కళావేదిక అంతర్జాతీయ చైర్‌పర్సన్ కొల్లి రమావతి, జాతీయ కన్వీనర్ వేమన, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు డాక్టర్ పెద్దింటి భాస్కరరావు, ఉత్తరాంధ్ర కన్వీనర్ డి.భాస్కరరావు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందించారు.

ప్రింట్ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలి



పీజీఆర్ఎస్ రివ్యూలో రూరల్ సీఐ నారాయణరావు

బొబ్బిలి: ప్రతీ సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతులను అన్ని శాఖల అధికారులు ప్రింట్ రూపంలో కన్వర్ట్ చేసి అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారంపై జూమ్ రివ్యూ నిర్వహించారు. స్థానిక రూరల్ సీఐ కె.నారాయణరావు పాల్గొన్న ఈ రివ్యూలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి నోడల్ అధికారి శ్రీనివాసమూర్తి పలు సూచనలు చేశారు. రామభద్రపురం తహసీల్దార్ వినతులకు పరిష్కారం చూపడంలో అలసత్వం వహిస్తున్నారని, తీరు మార్చుకోవాలని సున్నితంగా మందలించారు. జిల్లా వ్యాప్తంగా 14 శాతం పరిష్కారంలో వెనుకబడి ఉన్నట్టు అధికారులు ధృవీకరించారు.

దసరా బెల్లం ఘుమఘుమ

- నాగావళి నదీతీరంలో బెల్లం గానుగలు
- ఏటా దసరాకు పది రోజులు ముందే గానుగలు ప్రారంభం
- ఇక్కడి బెల్లానికి మంచి డిమాండ్
- క్వింటాల ధర రూ. 4,500



జావాంలో బెల్లం తయారీ

రాజాం/సంతకవిటి: దసరా పండగ మరికొద్ది రోజుల్లో రానుంది. ఈ పండగను పురస్కరించుకుని నాగావళి నదీతీరంలో బెల్లం గానుగలు ప్రారంభమయ్యాయి. ప్రతీ ఏడాది దసరా కంటే పదిరోజులు ముందుగానే బెల్లం గానుగలు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది కూడా నియోజకవర్గంలో సంతకవిటి, రేగిడి మండలాల్లో బెల్లం గానుగలు ప్రారంభించారు.

అధిక దిగుబడి..మంచి డిమాండ్

నాగావళి నదీతీరంలో పండించే చెరకు నుంచి బెల్లం దిగుబడి బాగుంటుంది. ప్రధానంగా సంతకవిటి మండలంలో జావాం, కె.ఆర్. పురం, బూరాడపేట, మేడమర్తి, తమరాం, హొంజరాం, చిత్తారిపురం గ్రామాలతో పాటు రేగిడి మండలంలోని ఖండ్యాం, కొమెర, దేవు దళ, పుర్లి తదితర గ్రామాల్లో రైతులు అధికంగా చెరకు పంటను సాగుచేస్తారు. ఇక్కడ ఈ పంట ఏపుగా పెరగడంతో పాటు మంచి దిగుబడి ఉంటుంది. సంకిలి వద్ద ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారానికి ఇక్కడి రైతులు తమ చెరకు పంటను విక్రయిస్తుంటారు. ఫ్యాక్టరీ వద్ద కూడా దసరాకు చెరకు కొనుగోలు ప్రారంభిస్తారు. అయితే కటింగ్ ఆర్డర్లు ఇవ్వడం, నగదు చెల్లింపుల్లో జాప్యం, మద్దతు ధర తక్కువ గా ఉండడంతో రైతులు కొంతమంది బెల్లం గానుగవైపు దృష్టిసారిస్తారు. ఇంటిల్లపాది కష్టపడి పండగ సమయాల్లో బెల్లం తయారు చేసి విక్రయించి మంచి లాభాలు ఆర్జిస్తుంటారు. ప్రస్తుతం జావాం, కె.ఆర్.పురం, కొమెర తదితర గ్రామాల్లో బెల్లం గాను గలు ప్రారంభమయ్యాయి. ఎకరా విస్తీర్ణంలో సాగు చేసిన చెరకు పంటను గానుగ ఆడడం ద్వారా రెండున్నర నుంచి మూడు టన్నుల వరకు బెల్లం దిగుబడి వస్తుంది. బెల్లం టన్ను ధర మార్కెట్లో రూ.45 వేల వరకు ఉంది. ఎకరా విస్తీర్ణంలో చెరకు సాగుకు రూ.50 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. బెల్లం బాగా విక్రయాలు జరిగితే రూ.70 వేల వరకు ఆదాయం ఉంటుంది.

ఆర్గానిక్ తయారీ

సంతకవిటి, రేగిడి మండలాల్లో బెల్లానికి చాలా డిమాండ్ ఉంది. ఇక్కడ పూర్తిగా ఆర్గానిక్‌తో తయారవుతుంది. ఎటువంటి రసాయనాలు ఉండవు. బెల్లం రంగు సహజసిద్ధంగా తెలుపుతో కూడుకుని వస్తుంది. అందుకే ఇక్కడ బెల్లానికి డిమాండ్ ఎక్కువ. పెద్దపెద్ద వ్యాపారులు వచ్చి బెల్లం కొనుగోలు చేసి తీసుకువెళుతుంటారు. ఉంటాయి. బెల్లం గానుగ సమయంలో మాత్రమే సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులకు ఇక్కడి బెల్లం దొరుకుతుంది. మిగిలిన సమయాల్లో ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది.

కూలీల కొరత ఉంది



ప్రస్తుతం బెల్లం తయారీ ప్రారంభించాం. ఈ ప్రాంతం బెల్లానికి మంచి డిమాండ్ ఉంటుంది. కష్టపడి బెల్లం గానుగచేస్తే మంచి లాభాలు ఉంటాయి. గానుగ చేసేందుకు రైతు కూలీల కొరత ఉంది. ఇంటిల్లపాది పనిచేస్తే మంచి ఫలితం ఉంటుంది. – పట్నాన ప్రేమ్‌కుమార్, చెరకు రైతు, జావాం గ్రామం, సంతకవిటి మండలం

ఇతర ప్రాంతాలకు ఎగుమతి



నియోజకవర్గంలో జావాం గ్రామ బెల్లానికి మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ ఆర్గానిక్ బెల్లం లభిస్తుంది. ఇతర ప్రాంతాలకు ఇక్కడి నుంచి వ్యాపారులు ఎగుమతి చేస్తారు. చెరకు రైతులకు బెల్లం గానుగకు సంబంధించి అధునాతన పరికరాలు అందిస్తే మరింత ఫలితం ఉంటుంది.

– బోనెల ప్రసాద్, సర్పంచ్, జావాం, సంతకవిటి మండలం



కె.ఆర్.పురంలో కోతకు వచ్చిన చెరకు పంట



జావాం వద్ద గానుగకు సిద్ధం చేసిన చెరకు



తయారైన బెల్లం

మర్యాదపూర్వక కలయిక



జగన్‌మోహన్‌రెడ్డితో శంబంగి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన, తలే రాజేష్, తదితరులు

బొబ్బిలి/రాజాం : తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పార్టీ ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జ్‌లతో బుధవారం సమావేశమ య్యారు. అనంతరం బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, పార్టీ పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై జగన్‌మోహన్‌రెడ్డి వీరిని ఆరా తీశారు. రాజాంలో పార్టీ నూతన కార్యాలయం ప్రారంభానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను జగన్‌మోహన్‌రెడ్డికి అందజేయగా, ఆహ్వాన పత్రికపై ఆయన ఆటోగ్రాఫ్ చేశారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి



జోగారావు దంపతులను సత్కరిస్తున్న ఎస్టీయూ నేతలు, ఎంఈఓలు

బొబ్బిలి: ఏ ఉద్యోగికైనా చేసిన సేవలే గుర్తింపును తీసుకువస్తాయని పలువురు వక్తలు అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన కె.కె.వలస హైస్కూల్ హెచ్‌ఎం కురమాన జోగారావును రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీఓ హోమ్‌లో బుధవారం ఘనంగా సత్కరించారు. అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, దత్తిరాజేరు,మక్కువ ఎంఈఓలు సుధాకర్, శ్యాంసుందరరావు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.సూరిబాబుమాట్లాడుతూ జోగారావు మాస్టారు సొంత నిధులతో పాఠశాలకు వివిధ సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేశారన్నారు. ఏపీ జేఏసీ అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు టి.సూర్యనారాయణ,బి.రామారావు, ఎన్.ఎస్.పేట,పెంట హైస్కూల్స్ హెచ్‌ఎంలు ఎస్.రామారావు, వేణుగోపాలరావు, వివిధ మండలాల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో ఉన్న పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నామని ఆలయ ఈఓ బీవీ మాధవరావు బుధవారం తెలిపారు. ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, ఆలయ తనిఖీదారు సమక్షంలో హుండీలు తెరవనున్నామని చెప్పారు.భక్తులు పాల్గొనాలని కోరారు.

డోలపేటలో వైద్యశిబిరం

రాజాం సిటీ: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణ పరిధి డోలపేట కనకదుర్గ ఆలయం వద్ద ఆలయ నిర్వాహకులు బుధవారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శ్రీకాకుళం జిల్లా రాగోలు వద్ద ఉన్న జెమ్స్ ఆస్పత్రి వైద్యులు శిబిరంలో 215 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఆలయ నిర్వాహకులు రూ. 5వేల విలువైన మందులు ఉచితంగా అందించారు. ఫొటో : 24ఆర్‌జెయం22 శిబిరంలో సేవలందిస్తున్న వైద్యసిబ్బంది.

కొబ్బరి మొక్కలతో అదనపు ఆదాయం

రేగిడి: పొలంగట్లపై కొబ్బరి మొక్కలు నాటుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎస్.హరనాథ్ అన్నారు. మండలంలోని అంబకండి, సోమరాజుపేట, ఉంగరాడ గ్రామాల్లో రైతులను బుధవారం కలిసి పొలంగట్లపై కొబ్బరి మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. మొక్కల పెంపకానికి అవసరమైన ఖర్చులను ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఆసక్తిగల రైతులు ముందుకు రావాలని కోరారు. ఆయన వెంట ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు ఉన్నారు.

అన్నపూర్ణగా దుర్గమ్మ



వంగర: రుషింగిలో అన్నపూర్ణా దేవిగా పూజలందుకుంటున్న అమ్మవారు



బొబ్బిలి: బొబ్బిలిలోని మహారాణి పేట వద్ద ఆలయంలో అన్నపు రాశితో పూజలందుకుంటున్న నూకాలమ్మ



బొబ్బిలిరూరల్: కృష్ణాపురంలో అర్ధనారీశ్వర సహిత అన్నపూర్ణా దేవిగా అమ్మవారి దర్శనం



రాజాం: రాజాంలోని గాయత్రీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



బొబ్బిలి: గొల్లపల్లిలో పూజలందుకుంటున్న అమ్మవారు



రేగిడి: ఉంగరాడమెట్టలో పూజలు చేస్తున్న భక్తులు

శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో, గ్రామాల్లో ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన మంటపాల్లో మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భక్తులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. – సాక్షి నెట్‌వర్క్

రోడ్డెక్కిన నీరు



రాజాం పట్టణంలోని గాయత్రీకాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై పంట కాలువల నీరు రోడెక్కింది. రోడ్డు దిగువన కల్వర్టు పాడవ్వడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువకు అడ్డంగా నిలిచిపోయాయి. దీంతో బుధవారం రోడ్డు మీద ఇలా నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నీరు రోడ్డుపై చేరుతోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కల్వర్టును పెద్దదిగా నిర్మిస్తే సమస్య ఉండదని, అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – రాజాం

పలుపత్ర ద్రావణంతో తెగుళ్లకు చెక్



పలుపత్ర ద్రావణాన్ని పంటలకు పిచికారీ చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో తెగుళ్లను నివారించవచ్చని, అలాగే ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు, మంచి దిగుబడిని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూర్య లక్ష్మి, సునీత, శ్రీరాములు అన్నారు. బొబ్బిలి మండలంలోని జగన్నాథపురంలో రైతులకు బుధవారం పలుపత్ర ద్రావణం తయారీపై అవగాహన కల్పించారు. పంటలను ఆశించే తెగుళ్ల, చీడపీడల నివారణకు ఎటువంటి పెట్టుబడి లేకుండా ప్రకృతిలో లభించే వివిధరకాల చెట్లు, మొక్కల ఆకులతో తయారు చేసిన ద్రావణాలు వినియోగిస్తే సరిపోతుందని చెప్పారు.రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. – బొబ్బిలిరూరల్

మట్టి రోడ్డు కంటే అధ్వానం



ఈ చిత్రంలో మహిళలు చూపిస్తున్న రోడ్డు మట్టిరోడ్డు అనుకుంటే పొరపాటే. ఇది రామభద్రపురం మండలంలోని కొండకెంగువ సచివాలయానికి వెళ్లే సిమెంట్ రోడ్డు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇటీవల తాగునీటి కుళాయిల ఏర్పాటు కోసం సంబంధిత కాంట్రాక్టర్ జేసీబీతో సీసీ రోడ్డును తవ్వి పైపులు వేశారు. అయితే ఆ పైపులను కప్పేసి, మిగిలిన మట్టిదిబ్బలను బయటకు తరలించకుండా వదిలేశారు. వర్షాలకు ఈ మట్టి కరిగి రోడ్డంతా బురదమయ మవుతోంది. రోడ్డును పైపు లైన్ కోసం తవ్వేయడంతో గోతులు తేలి అధ్వానంగా తయారైంది. గోతులు, బురద వల్ల ఆరోడ్డు మీదుగా సచివాలయానికి వెళ్లే ప్రజలతో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – రామభద్రపురం

పారిశుద్ధ్యం నిర్వహణపై అలసత్వం వద్దు



పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఎంపీడీఓ ఆనందరావు

రాజాం సిటీ: గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అలసత్వం ప్రదర్శించవద్దని ఎంపీడీఓ జె.ఆనందరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తరచూ పారిశుద్ధ్య పనులతో పాటు తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. అలాగే పెండింగ్ హౌస్ ట్యాక్స్, స్వమిత్వ సర్వే, స్వచ్ఛతాహి సేవా తదితర అంశాలపై సమీక్షించారు. డిప్యూటీ ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్

తెర్లాం: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు వంశీకృష్ణ, స్వాతి అన్నారు. స్వస్థనారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వద్ద వైద్యశిబిరంతో పాటు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు.శిబిరంలోమహిళలకు ప్రత్యేక వైద్యులతోపాటు, పీహెచ్‌సీ వైద్యులు వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే తెర్లాం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి.పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను, ఆరోగ్య జాగ్రత్తలను వైద్యాధికారులు మహిళలు, గర్భిణులకు వివరించారు .ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏటా సెప్టెంబర్24న జాతీయసేవా పథకం దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఎన్ఎస్ఎస్ పీఓ సూర్యనారాయణ చెప్పారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీలో ప్రిన్సిపాల్ విజయకుమారి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వల్ల సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని అన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టమ్ వితరణ

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయానికి బొబ్బిలి పట్టణానికి చెందిన సౌత్‌సెంట్రల్ రైల్వే చీఫ్ విజిలెన్స్ అధికారి చింతపల్లి సత్యారావు సుమారు రూ.11వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను బుధవారం అందజేశారు. దాతకు గ్రంథాలయ అధికారి దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు.

మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం

బొబ్బిలిరూరల్: మహిళలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని పక్కి పీహెచ్‌సీ వైద్యాధికారి తనూజ సూచించారు.స్వస్థనారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివడవలస గ్రామసచివాలయంలో మహిళల కోసం బుధవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో 150 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మహిళలకు ఆరోగ్య జాగ్రత్తలు, పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు సర్పంచ్ వెంగళ లక్ష్మీరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.